
# ఎవడి పిచ్చి వాడికానందం



**షేక్ మస్తాన్ వలి**

**అన్నీ కలిసొచ్చాయి.**

**స్వంతూరికే బదిలీ! భార్యా బిడ్డలు శలవలకని అక్కడికే వెళ్ళున్నారు. రేపే రిలీవరొస్తున్నాడు.**

**మిగిలింది ఎల్లుండి ప్రయాణమే.**

**ఆనందంతో గంతేశాను.**

**"ఇవ్వాళ సోమవారం కదా!" ఛాంబర్‌లో ఆఫీసర్ హోదాలో అడిగాను.**

"అవును! బాస్ కామాత్రం తెలియదా" అన్నట్లు చూశాడు హెడ్ క్లార్క్ నరసింహం.

"బుధవారం ఉదయం నలుగురు కూలీలను ఇంటి సామాన్ల ప్యాకింగ్‌కు ఏర్పాటు చేయి."

"అలాగే!"

"సాయంత్రం నాలుక్కు లారీ, నువ్వు మా ఇంటికి రావాలి!"

"అలాగే!"

"ట్రాన్స్‌పోర్టులో బార్గెయిన్ గట్టిగా చెయ్".

"అలాగే"

"అడ్వాన్సివ్వటానికి నాలుగొందలుంచు".

"అలాగే" డబ్బు తీసుకున్నాడు.

"అంత పరధ్యానంగా ఉన్నావ్! కొంప తీసి అరేంజ్‌మెంట్స్ ఫెయిల్ చేస్తావా?... యేం?"

"అలాగే!"

"ఏంటి?... నువ్వనేది?"

"సారీ సార్!... అన్నీ సక్సెస్ చేస్తా!" తల విదిలించుకుంటూ బయటకు నడిచాడతను.

ఇంతసేపు మమ్మల్నే గమనిస్తున్న అటెండర్ అంకయ్య నాతో ఏదో చెప్పాలని ప్రయత్నించి, గభాల్న బురదలో దాక్కున్న తాబేల్లా ఆగిపోయాడు. వెళ్తు వెళ్తూ ఓ పిచ్చి నవ్వు కూడా విసిరాడు.

ఐనా ఆ విషయం అప్రస్తుతం గనుక, దాన్నొది లేసి ఫష్టు షో కెళ్ళాలని ఐదుకే ఆఫీసొదిలాను.

బుధవారం నలుగురు పనోళ్ళు నరసింహం పంపారంటూ వచ్చారు.

సామాన్ల ప్యాకింగ్ మొదలైంది. గది తరువాత గది సాయంత్రం మూడుకు ముగిసింది. నాలుక్కు లారీ వస్తే లోడ్ చేయటమే!

లంచ్ ముగించి రాకింగ్ చైర్‌లో సెటిలయి టైం గడవక న్యూస్ పేపర్ని రెండోసారి తిరగేస్తున్నా.

అంతలో ఆఫీస్ సిబ్బంది సెండాఫివ్వటాని కొచ్చారు. వారితో మాట్లాడుతూ చిన్న ముల్లును నాలుక్కు నడిపించా.

బయట లారీ శబ్దమైంది.

"శభాష్! నరసింహం టైమ్‌కొచ్చాడు!" అని బైట కొచ్చాను. సిబ్బంది వచ్చారు.

కాని అదేదో లారీ ఎక్కడికో తుర్రుమని నిరుత్సాహం మిగిలించింది.

కాలం జరుగుతోంది. ప్రతి నిముషం లెక్కెడ్తూ లారీకై ఎదురు చూస్తున్నా. ఊ! ఊ! ఆ జాడే కనపడ్లేదు. అసహనం పెరిగింది.

"యాంది సార్! ఆయనగారికి లారీ నాలుక్కేనని సెప్పారుగా!...ఇప్పటిదాక అడ్రసే లేకుంది!" నన్నదే పనిగా గమనిస్తున్న అంకారావు పళ్ళికిలించాడు.

"వస్తుండొచ్చు!" ముక్తసరిగా చెప్పి, "మొన్న వీడిసిరిన వెధవ నవ్వు కర్థమిదేనేమో!" అనుకున్నా.

భారంగా ఐదయింది.

నరసింహం పిల్లిలా వచ్చి సైకిల్ స్టాండేసి, "సార్! వచ్చిందా?" అన్నాడు.

"ఏందయ్యా!? వచ్చింది!...అది చెప్పాల్సింది నువ్వు! తిరగబెట్టి నన్నే అడుగుతున్నావ్!" అరికాలి మంట నెత్తికెక్కింది.

"రాకపోటమేంటి సార్!.... చిత్రంగుందే!... ఒకటా!... రెండా! పది సందులు గాలించా!... అప్పటికి కనిపించలే! ఎక్కడికెల్లిందో?... యాందో?... అర్థం కాలే!... అయినా కావాలని కొన్నది గదండీ! తప్పకొస్తుంది!" అంటూ ఏదేదో మాట్లాడాడు.

ఆ పిచ్చి ధోరణికి కంపరం పుట్టి, "చూడబ్బా! నువు చెప్పేది చూస్తే అది బయల్దేరినట్లుంది! మరింత సేపేమైందో?... ఎక్కడుందో? ఏజన్సీకి ఫోన్ చేసి తెలుసుకో!" అన్నాను.

అతను ఫోన్ అందుకున్నాడు.

"హల్లో!... హల్లో!... నరసింహాన్ని!"

"............."

"నాకోసం చూట్టమేందీ? వెంటనే వెతకటం మొదలెట్టండీ! ఇప్పటికే బాగా టైమైంది! మధ్యాహ్నమనగా పోయింది! ఎక్కడుందో?... యాందో?... అది నలుపు తెలుపు రంగుల్లో ఉంటుంది! గున గున నడుస్తుంది! ఎట్టయినా దాన్ని పట్టి మ్యాట్నీ వదిలేలోగా నా కొంపకు తీసుకురండి! కాకుంటే నా భార్యతో పేచి వస్తుందయ్యా!"

".............."

"దేన్ని గురించేంటయ్యా!..... నే మాట్లాడేది కోడి సంగతే!"

".............."

"లారీ కాదయ్యా!.... చెప్పేది కోడి సంగతే!"

"..........."

"పిచ్చెందుకండీ!... చెప్పింది చేస్తే పోద్దిగా!... సింపుల్!" అంటూ రపీన ఫోన్ పెట్టేశాడు.

అతని పోకడ వింతనిపించింది.

"కోడంటాడు! నలుపు తెలుపంటాడు!... నడుస్తుందంటాడు!.... భార్యంటాడు!.... కొంప తీసి వీడికి ఒరిజనల్‌గానే స్క్రూ లూజా? లేక దార్లో గాలేదైనా సోకిందా? కాకుంటే చేయాల్సిన దానికి, చెప్పేదానికి పొంతనే లేదే! ఎందుకైనా మంచిది!... ఇష్యూ జాగ్రత్తగా టాకిల్ చేయాలి!" నిర్ణయానికి వచ్చి, "లారీ అనకుండా కోడంటా దేంటి నరసింహం?" అని బుజ్జగింపుగా అడిగా.



మే 7న జంట నగర ప్రముఖ సాంస్కృతిక సాహితీ సేవా సంస్థ "రాగ సప్త స్వరం" శ్రీ త్యాగరాయ గాన సభ, చిక్కడపల్లి, హైదరాబాద్‌లో సినీకవి స్వర్గీయ ఆచార్య ఆత్రేయ జయంతి సందర్భంగా, ఆచార్య ఆత్రేయ సినీ గీతాలను నిర్విరామంగా ఆరు గంటలపాటు ఆలపించిన మహిళలు.

"కోడన్నానా.... సార్!" ఉలిక్కిపడ్డ నరసింహం అమాయకంగా అడిగాడు.

"ఆ!... అదే అన్నావ్!.... మేం విన్నాం!"

"అలాగే సార్!... అట్టయితే!.... అది.... అది!" అంటూ నసిగాడు.

"చెప్పవయ్యా!" అసహనంగా అడిగా.

"అదే సార్! పొద్దున్న నా భార్య వీధి బేరగాడి దగ్గర ఒక కోడిని కొని గంపకిందేసింది. జబ్బుది గనుక దాని ధర తగ్గించాడని నా అనుమానం. అదే అంటే ఆమె నన్నోట్రించింది. ఆనక ఆమే మ్యాట్నీకెళ్ళింది. అప్పుడు సందేహం తీర్చుకోటానికి గంపెత్తి దాన్ని పట్టి పరిక్షిద్దామనుకున్నా!.... కాని బ్యాడ్ లక్ సార్! అది అమాంతం చేతిని గీకి ఉడాయించింది. ఇక చూస్కోండి! నా అవస్థ!.... సందుల్లో దాన్ని తరిమి తరిమి అలసిపోయా!...." పసందుగా చెప్తున్న అతను మధ్యలో ఆపాడు.

మేం నోళ్ళు తెరచి వింటున్నాం.

"ఇంత చేసినా అది దొరకలేద్సార్! దొరికిద్దో లేదో కూడా తెలియదు! చేజేతుల వదిలించడానికి మా ఇంటామె ఏం కోటింగిస్తుందోనని భయంగుంది! ఆ దిగుల్లో మూడున్నరకు లారీకై ఏజన్సీకి వెళ్ళలేకపోయాను!... ఎలాగు టైమైందిగదా... లారీ వచ్చుంటుందని ఇక్కడికొచ్చా!.... బహుశా ఆ టెన్షన్లో లారీ బదులు కోడన్నానేమో!" అని సవినయంగా ముగించాడు.

అది విన్న నేను కెవ్వనరచి చొక్కాను పీలికలుగా చించుకుందామనుకున్నా. కాని అలా చేస్తే స్టాఫ్ దృష్టిలో చులకనవుతానని ఆగిపోయా.

అప్పటికే వారు ఒకర్నొకరు చూసుకొని, నవ్వుకుంటున్నారు.

నాకు చిర్రెత్తుకొచ్చి, "చూడు దొరా!... ఇంతకు ఈ రోజుకది వచ్చి తగలడద్దంటావా?" అని లారీని గురించి నిలదీశా.

"వచ్చి తీరుద్ది సార్!... కోడి!... అది నా పెళ్ళాం కొన్నదండీ!" నరసింహం యమ కూల్‌గా అన్నాడు.

"ఓరి నీ కోడి కూరగాను! అడిగేది లారీ సంగతయ్యా!" అంత కోపంలోను నాకు నవ్వాగలేదు.

మిగిలినోళ్ళు శృతి గలిపారు.

సరిగ్గా అప్పుడే బైట లారీ ఆగింది.

"సారూ! కాంటరాట్టు సేసుకొన్న నరసింహం అనుకున్నట్టు ఏజన్సీకి రాలేదు! నేనక్కడే సూత్తుంటే ఇప్పుడే ఫోన్ సేసి తిక్క తిక్కగ మాట్టాడండీ! అర్థంగాక బయలెల్లి వచ్చానయ్యా!... ఆలస్యానికి మాకే సంబంధం లేదు!" అని డ్రయవర్ వివరించాడు.

అడ్వాన్స్ పోను ఇవ్వాల్సిన ఫ్లయిట్ ఛార్జీలకు కంపెనివారి బిల్లిచ్చాడు.

జరిగిన జాప్యానికి కారణం నరసింహమేనని తేలింది.

ఆ విషయమంతటితో వదిలి లారీని లోడ్ చేయమన్నాను.

ఇంకో రెండు గంటల్లో సామాన్లెత్తారు.

రాత్రి ఏడుకు ప్రయాణానికి సిద్ధమయ్యాను.

స్టాఫ్‌కు వీడ్కోలు చెబ్తూ చివరిగ, "వస్తానయ్యా! థాంక్యూ ఫర్ ది హెల్ప్ యూ హావ్ రెండర్డ్!...ఆ!... అన్నట్లు మరిచాను! నిన్ను మేనేజర్‌గా ప్రమోట్ చేయాలని స్పెషల్ సి.ఆర్. అడిగారు!.... బాగానే వ్రాసాను!... సో యూ కెన్ ఎక్స్‌పెక్ట్ దట్ ఎట్ ఎని టైమ్!" అని నరసింహంతో చేయి కలిపాను.

"థాంక్యూ సో మచ్ సార్!.... నా కోడి పై మీకెంత శ్రద్ధండీ! వెళ్ళేటప్పుడు కూడా అదొస్తుందని విష్ చేస్తున్నారు!... నిజంగా మీది గొప్ప మనస్సండి!" నరసింహం నా చేతిని నొక్కాడు.

ప్రమోషన్ లాంటి సంగతి కూడా అతని కోడి ఆలోచనను ఆపలేకపోయింది.

అతని మాటలకు స్టాఫ్ పగలబడి నవ్వుతున్నారు.

"ఏం చేస్తాం?... ఎవడి పిచ్చి వాడికానందం!" అనుకొని వారితో శృతి కలిపాను.

చివరిగా అందరికీ టాటా చెప్పాను.